గుంతల రోడ్లతో అవస్థలు

- వర్షాలకు దెబ్బతిన్న డిండి – దేవరకొండ రహదారి
- పది నెలల క్రితమే రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాన
- ఇప్పటికీ ప్రారంభం కాని పనులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు


కల్వర్టు వద్ద గుంతల మయంగా మారిన బీటీ రోడ్డు

డిండి : డిండి నుంచి దేవరకొండ వెళ్లేరోడ్డుపై గతుకులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. గడిచిన మూడేళ్ల కాల వ్యవధిలో కురిసిన వర్షాలకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని 38 గ్రామ పంచాయతీల ప్రజలు సరుకుల కొనుగోలు , ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం ప్రతినిత్యం మండల కేంద్రానికి వస్తుంటారు. ఈ సందర్భంలో ప్రయాణికులు పలుమార్లు ప్రమాదానికి గురైన ఘటనలు కూడా ఉన్నాయి. ఈమార్గం గుండా ప్రయాణించే వారు తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని పోతున్నారు.

ఆదమరిచితే అంతే సంగతులు..

మండల కేంద్రం నుంచి దేవరకొండ నియోజకవర్గం, జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఈ రోడ్డుమార్గం (డిండి–దేవరకొండ) గుండానే మండల ప్రజలు ప్రయాణం చేస్తున్నారు. ఈ మార్గంలో ఉన్న డిండి ప్రాజెక్టు మెయిన్ కెనాల్ వంతెన వద్ద, పట్వారి తూం సమీపంలో నున్న రోడ్డు మధ్యలో లోతుగా గుంతలు ఏర్పడటంతో ముఖ్యంగా రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనం, ఆటోలు నడిపే డ్రైవర్ ఏ పాటి ఆదమరిచినా సదరు వాహనం నేరుగా కాలువలోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా సంబదితాధికారులు వెంటనే స్పందించి దాదాపు పదినెలల క్రితం నూతన బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పనులు ప్రారంభించాలి



డిండి నుంచి దేవరకొండ వెళ్లే రోడ్డుమార్గంలో గుంతలు ఏర్పడటంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో ప్రయాణం నరకయాతనగా ఉంటుంది. శంకుస్థాన చేసిన బీటీరోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి.

– మేడమోని నిరంజన్, ఆటో డ్రైవర్

ప్రమాదాలకు గురవుతున్నాం



బీటీరోడ్డుకు మరమ్మతులకు గురికావడంతో ఈ మార్గం గుండా ప్రయాణం చేయాలంటే ఇబ్బదికరంగా మారింది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఏదైనా ఆపదొస్తే ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో మండల ప్రజలకు పలుమార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి

– జంగయ్య ఎర్రారం

క్లుప్తంగా

యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

మిర్యాలగూడ టౌన్ : ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా గుండా నాగరాజు ఎన్నికయ్యారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణ కిరాణ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగరాజును ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సన్మానించిన వారిలో అసోసియేషన్ నాయకులు ఎం.మురళి, యాదగిరి, సోమచంద్ర శేఖర్, భరత్, నవీన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన ఎంపీడీఓ


మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలరాజురెడ్డి

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డు పాత ఊరిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ బాలరాజురెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు ఆయన పలు సూచనలు చేశారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి డాకు నాయక్, కాంగ్రెస్ నాయకుడు కై సర్‌ఖాన్, బూడిద మల్లేష్‌యాదవ్, పంచాయతీ సిబ్బంది రాంరెడ్డి, లక్ష్మణ్ తదితరులున్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని దేవరకొండ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేశ రవి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ మండలాల మెడికల్ ఆఫీసర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఓపీ సేవలు, రక్త పరీక్షలు, టీబీ కేసులతో పాటు పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీటీసీఓ కళ్యాణ్‌చక్రవర్తి, పీఓడీటీ కృష్ణకుమారి, మండల మెడికల్ ఆఫీసర్ ఉషారాణి, వివిధ మండలాల మెడికల్ ఆఫీసర్లు, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు


ప్రభుత్వ భూమిని గుర్తించి బోర్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్‌హరిబాబు

మిర్యాలగూడ : ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరిబాబు అన్నారు. మంగళవారం వెంకటాద్రిపాలెం గ్రామంలో సర్వే నంబర్ 14లో 1.8ఎకరం ప్రభుత్వ భూమిని గుర్తించి సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎవరైన ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, బోర్డును తొలగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలి

పెద్దవూర : మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త శ్రీను సాగర్ మంగళవారం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక చొరవ తీసుకుని త్వరితగతిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలని విన్నవించారు.

సీఎం కప్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 19న నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ కెకె. జయరాజన్ అన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన అభినందించి మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి శ్రీధర్ జావెలిన్ త్రోలో జిల్లా ప్రథమ స్థానం, గౌతం జిల్లా రెండో స్థానంలో సత్తా చాటారు. ప్రతిభ చాటిన విద్యార్థులు ఈనెల 30న హన్మకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజయ్‌కుమార్, ఉపాధ్యాయులు రమేష్, శివశంకర్‌లు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో మౌలిక వసతులు కల్పించండి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


మార్కెట్‌యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని అవంతీపురం మార్కెట్‌యార్డు సంత సందర్భంగా అక్కడికి వెళ్లి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌యార్డులోని మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం ధాన్యం గోదాములను, మార్కెట్‌యార్డులోని ఐకేపీ సెంటర్‌లో నిల్వ ఉంచి ధాన్యాన్ని పరిశీలించి రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని మిల్లర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించారని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు


సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్లు

మిర్యాలగూడ టౌన్ : ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తుండగా తమ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాని కోరుతూ మంగళవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వార్డు ఆఫీసర్లు వినతిపత్రం అందజేశారు. అంతకముందు రెండు గంటల పాటు సర్వేను బహిష్కరించారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వార్డు ఆఫీసర్ పి.రంగారావు మాట్లాడుతూ 32 వార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తుండగా బంగారుగడ్డకు చెదిన షేక్ ఆరీఫ్ అనే వ్యక్తి తన విధులకు అటంకం కలిగించడంతో పాటు అసభ్యకరంగా మాట్లాడని తెలిపారు. వార్డులో తనను కించపరిచే విధంగా వ్యవహరించాడని, తన సెల్‌ఫోన్‌ను లాక్కోవడంతో పాటు దాడికి యత్నించినట్లు తెలిపారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వార్డు ఆఫీసర్లు ఎం.తిరుమలేష్, ఎస్.సైదులు, సీహెచ్ విజయ్, సత్యం, కె.యల్లయ్య, ఎస్.యాదగిరి, ఎ.రమేష్, కె.ప్రసాద్, సైదులు, సైదులు, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, సురేష్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న డీఎం రమేశ్‌బాబు

దేవరకొండ : ప్రయాణికులు ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు అన్నారు. డీలక్స్ బస్సులో ప్రయాణించి లక్కీ డ్రా ద్వారా ఎంపికైన ముగ్గురు మహిళా ప్రయాణికులకు మంగళవారం ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన ముగ్గురు ప్రయాణికులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి వారికి బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి 15రోజులకు ఒకసారి డ్రా పద్ధతిన ముగ్గురిని ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులు టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం పడాల సైదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామి సేవలు మరువలేనివి


పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు , విద్యార్థులు

మిర్యాలగూడ అర్బన్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పెరియార్ రామస్వామి చేసిన సేవలు మరువలేనివని అని బీసీ సంఘం నాయకులు జ్వాల వెంకటేశ్వర్లు, చేగొండి మురళియాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని హౌసింగ్‌కాలనీలోని నేతాజీ హైస్కూల్‌లో నిర్వహించిన పెరియార్ రామస్వామి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పెరియార్ రామస్వామి చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని కులాలను సమానంగా చూడాలని చాటి చెప్పాడని, బహుబాషా కోవిదుడిగా చరిత్రకెక్కాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీపతి శ్రీనివాస్, ఉపాధ్యాయులు బీమ్లానాయక్, నూరి, అలివేలు, సునీత, బజీస్, కళ్యాణి, వసంత, శోభ, సైదమ్మ, సత్యం, చిమట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్


బస్ జాతాలో మాట్లాడుతున్న భూపాల్

దేవరకొండ : ఎన్నికల ముందు ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని సీఐటీయూటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన బస్సుజాతా మంగళవారం దేవరకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బస్సుజాత రథసారథి, యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలన్నారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు టీడీడీ కల్యాణ మండపం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రమోహన్, సీహెచ్.లక్ష్మీనారాయణ, మహేశ్వరి, వెంకటమ్మ, నల్ల వెంకటయ్య, ఏర్పుల యాదయ్య, నాగటి నాగరాజు, యాదగిరి, బిజిలి లింగయ్య, జ్యోతి, వెంకటేష్, ముత్యం, కాశయ్య, శ్రీను, కవిత తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో పాటు హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు ఆ పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వనం భవాని వినతి పత్రం అందజేశారు. తాను పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించేందుకు వెళ్తే మాటమాటకి రావొద్దని నిర్వాహకులు అంటున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లిన స్పందించలేదని తెలిపారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చర్చిలు ముస్తాబు



నాగార్జునసాగర్ : హిల్ కాలనీలో క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు


నాగార్జున సాగర్ : చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ, క్రీస్తు జనన దృశ్యం


మిర్యాలగూడ : ఆదిత్య పాఠశాలలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి


హాలియా : ప్రేమ విందులో భాగంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి


పెద్దవూర : కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : క్రైస్తవుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా హాలియాలోని లక్ష్మీ నర్సింహా గార్డెన్‌లో మంగళవారం సాగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల క్రైస్తవులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రేమవిందు ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఏసు క్రీస్తును స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెండు 108 అంబులెన్స్ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి, హాలియా, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ అనుపమనరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు రామేశ్వరీ, భారతిభాస్కర్ నాయక్, మాజీ ఎంపీపీలు భగవాన్ నాయక్, అనుముల పాండమ్మ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఘు, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, సాగర్ నియోజకవర్గ ఫాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు నంద్యాల ఏలీషా రావు, చందునాయక్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు కొనసాగిస్తున్నాం

పెద్దవూర: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నట్లు సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 114 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, ఇద్దరికి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పెద్దవూర మండలంలోనే రూ.1.16 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని ముసలమ్మచెట్టు స్టేజీ గ్రామానికి చెందిన అటికం చినమట్టయ్యకు రూ.60వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి, హాలియా ఏఎంసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, తహసీల్దార్ సరోజ పావని, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరి, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకన్న, మునిరెడ్డి, బోయ నరేందర్ రెడ్డి, ఎండీ.హైమద్‌అలీ, అశోక్, కిలారి మురళీయాదవ్, సతీష్, వెంకటయ్య, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి

హాలియా : సాగర్ నియోజకవర్గంలో ఎలాంటి విద్యుత్ సమస్య రాకుండా చూడాలని సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హాలియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాలలో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటికే నూతన సబ్ స్టేషన్లకు, డ్యామేజ్ అయిన లైన్లు, నూతన డీటీఆర్, ఏజీఎల్ కనెక్షన్లు, కన్వర్షన్ లైన్లు ఇంకా గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ద్వారా రూ.16 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ బడ్జెట్ ఏఏ పనులకు ఎంతో అవసరం ఉంటుందో విద్యుత్ అధికారులు అంచనాలు వేసి ఇవ్వాలన్నారు. త్వరితగతిన అంచనాలు ఇస్తే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ అధికారులు తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన వెంకన్నగౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు, గ్రామమాజీ సర్పంచ్ నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.6వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ నాయకులు కందిమళ్ల శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేలను మృతుడి కుటుంబానికి అందించగా జొన్నలగడ్డ నర్సిరెడ్డి కుమారుడు సంపత్‌రెడ్డి రూ.5వేలను అందజేశారు ఈ కార్యక్రమంలో లింగయ్యయాదవ్, రాములుగౌడ్, జానకిరాములుగౌడ్, సైదులుగౌడ్, యాదగిరియాదవ్, వెంకన్నయాదవ్

బాధిత కుటుంబానికి..

హాలియా : ఇటీవల కాలంలో తిరుమలగిరి (సాగర్) మండల కేంద్రానికి చెందిన పెదమామ సైదులు కుటుంబ సభ్యులు ఇంట్లో ఎవరూలేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లుతో పాటు ఇంట్లోని సామగ్రి, వస్తువులు పూర్తిగా కాలిపోయి సుమారు రూ. 2లక్షల ఆస్తినష్టం జరిగింది. ఈ విషయాన్ని లింగాల వరప్రసాద్ ద్వారా తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి(సాగర్) మండల మాజీ వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ వచ్చేలా చూడాలని వినతి

త్రిపురారం : మండలంలోని మాటూర్ గ్రామ పంచాయతీకి ఎస్సీ రిజర్వేషన్ వచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు వినతిపత్రం అందజేశారు. మాటూర్ గ్రామ పంచాయతీకి 1995 నుంచి 2004 వరకు 30ఏళ్లు గడిచినా ఎస్సీ రిజర్వేషన్ రాలేదన్నారు. గ్రామంలో ఎస్సీ ఓటర్ల తరువాత అధికంగా ఎస్సీల ఓట్లు ఉన్నాయన్నారు. ఓటర్ల ప్రతిపాదికన ఈసారి పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయడానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలకొండ శ్రీనివాస్, అభిరాం, శివశంకర్, మల్లయ్య, కొత్తపల్లి మహేష్, వడ్డే ఏసు, ఉప్పరి మహేష్, కొత్తపల్లి శ్రీకాంత్, మదుపు నాగరాజు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' పోస్టరు ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : ఫీజు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ జనవరి 8న నిర్వహించే బీసీల సమర శంఖారావం పోస్టర్‌ను మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగం గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, బీసీ ఏసీ కన్వీనర్ నాగేశ్వర్‌రావు యాదవ్, నాయకులు దుర్గయ్య, జయమ్మ, సావిత్రి, శేఖర్, బాలాజీ, అరవిందు, వివేకానంద, ఖరీం , తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి


ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

త్రిపురారం : ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాలని త్రిపురారం మండల బీజేపీ అధ్యక్షుడు పానుగోటి హరీశ్ అన్నారు. మంగళవారం త్రిపురారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జంగాల కాలనీ(దుబ్బ మీద)ని విడదీసి నూతన పంచాయతీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెంట్ దయాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాక్షులు రెమడాల రమేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు వల్లపుదాసు హుస్సేన్, మండల కార్యదర్శి మహేష్, వెంకటేశ్వర్లు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.